క్లుప్తంగా

31 నుంచి మహాభారత యజ్ఞం

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ఈ నెల 31 నుంచి మహా భారత యజ్ఞం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బండి ఉమాపతి రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 31న ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమై జూన్11న అగ్నిగుండ ప్రవేశంతో ముగుస్తాయన్నారు. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

విత్తనాలు కొనుగోలులో జాగ్రత్త

విజయపురం (నగరి): వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు విత్తనాలు కొనుగోలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని శుక్రవారం వ్యవసాయాధికారిణి రజిని కుమారి ఓ ప్రకటనలో కోరారు. రైతులు విధిగా లైసెన్స్ పొందిన డీలరు వద్ద అనుమతులు ఉన్న కంపెనీల విత్తనాలను కొనుగోలు చేయాలని, అలాగే విధిగా బిల్లు తీసుకోవాలని, బిల్లులో పట్టాదారు పాసుపుస్తకంతో ఉన్న ప్రకారం పేరు, ఫోన్ నంబరు, విత్తనం బ్రాండ్ తదితర వివరాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. బిల్లు, విత్తనాల సంచిని పంట కాలం పూర్తి అయ్యే వరకు భద్రపరచుకోవాలన్నారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు విత్తనాలను విక్రయిస్తే సంబంధిత వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

కొబ్బరి సాగుతో అధిక లాభాలు


మాట్లాడుతున్న శాస్త్రవేత్త నాగమణి

పాలసముద్రం : రైతులు కొబ్బరి పంట సాగు చేసుకుంటే అధిక లాభాలు పొందవచ్చని శాస్త్రవేత నాగమణి తెలిపారు. పాలసముద్రం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం ఎంపీపీ శ్యామల ఆధ్వర్యంలో కొబ్బరిని ఆశ్రయించే ఎర్రముక్క పురుగు నివారణపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చిత్తూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త నాగమణి మాట్లాడుతూ ఎర్రముక్క పురుగు ఆశించకుండా కొబ్బరి తోటలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చనిపోయిన చెట్ల మొదళ్లను తీసి కాల్చివేయాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ


అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి వీరపాండ్యన్

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): మండలంలోని ఉగ్రాణంపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ప్రత్యేక అధికారి జి.వీరపాండ్యన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన అంగన్‌వాడీ కేంద్రానికి విచ్చేసి అక్కడి రికార్డులను పరిశీలించి, పిల్లల హాజరు, వారికి అందించే పౌష్టికాహార స్టాక్ వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం


మల్లారెడ్డికండ్రిగలో ఏర్పాటు చేస్తున్న తాగునీటి మోటారు

విజయపురం (నగరి): మండలంలోని మల్లారెడ్డికండ్రిగ ఆది ఆంధ్రవాడలో శుక్రవారం ఉదయం తాగునీటి మోటార్ మొరాయించింది. సర్పంచ్ శాంతికి సమస్యను గ్రామస్తులు నివేదించారు. మంత్రి ఆర్కే రోజా ఆదేశాలతో బోరు నుంచి మోటార్‌ను వెలికితీసి, మరో మోటార్ అమర్చి, తాగునీటి సమస్యను పరిష్కరించారు. అత్యవసరమైన వాటిపై మంత్రి రోజా తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరిస్తున్నారని సర్పంచ్ శాంతి, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సివిల్స్ టాపర్‌కు కలెక్టర్ సన్మానం


పవన్‌దత్తను సన్మానిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: సివిల్స్‌లో రాష్ట్రంలో మొదటి ర్యాంక్ సాధించిన జీవీఎస్ పవన్‌దత్తను కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సత్కరించారు. తిరుపతికి చెందిన డాక్టర్ జీవీఎస్ పవన్‌దత్త 2014 బ్యాచ్‌లో డాక్టర్ పట్టాను పొందారు. అనంతరం ఆయన సివిల్స్‌పై దృష్టిసారించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎం.శ్రీనివాసరావు, సెట్విన్ సీఈవో వి.మురళీకృష్ణ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.ప్రవీణ్, పవన్‌దత్త తల్లిదండ్రులు లలిత కుమారి, జి.వెంకటేశ్వర్లు, కే.రాధాకృష్ణ వర్మ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు.

చేరువైన వైద్యం..ఆరోగ్యానికి ధైర్యం

విజయపురం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) రోగులకు మెరుగైన వైద్య సేవలతో ఆరోగ్యానికి భరోసా కలిగించేలా మారింది. ఒకప్పుడు మెరుగైన వైద్యం కోసం నగరి, పుత్తూరు పట్టణాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వైద్యరంగానికి కూడా ప్రాధాన్యత ఇవ్వడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గతంలో 15 రకాల వైద్యసేవలు మాత్రమే అందేవి. ఇప్పుడు 63 రకాల సేవలు అందుబాటులోకి తేవడం, అవసరమైన నిర్ధారణ పరీక్షలకు వైద్య పరికరాలు, యంత్రాలు ఇవ్వడంతో మెరుగైన వైద్యం ప్రజల ముంగిటకే చేరింది.

- అందుబాటులోకి 63 రకాల వైద్య సేవలు
- వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట


విజయపురం పీహెచ్‌సీ


అత్యాధునిక ల్యాబ్


గర్భవతులకు పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

విజయపురం (నగరి): వైద్యరంగానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిచ్చి, ప్రత్యేక నిధులు కేటాయించడంతో ఆరోగ్య కేంద్రాల రూపురేఖలను మారిపోయాయనడానికి స్థానిక పీహెచ్‌సీయే దర్పణంగా నిలుస్తోంది. తగినంత సిబ్బందిని నియమించి, శిక్షణ ఇవ్వడం, వ్యాధి నిర్ధారణ పరీక్షలకు అధునాతన యంత్ర సామగ్రిని ఇవ్వడంతో త్వరితగతిన వైద్య సేవలందేలా కృషి చేస్తున్నారు. ఒక్కో పీహెచ్‌సీకి యూరిన్ ఎనలైజర్, టీలీ, పీసీఆర్, బయోకెమిస్ట్రీ ఎనలైజర్, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్, సీబీసీ తదితర యంత్ర పరికరాలను అందచేసింది. పలు వైద్యపరీక్షలు చేసే అవకాశం కల్పించారు. ప్రతి పీహెచ్‌సీకి అత్యాధునిక పరికరాలు వచ్చాయి. ల్యాబ్ టెక్నీషియన్ ప్రత్యేకంగా నియమించారు.

వైద్య సేవలు ఇలా..

హెచ్‌బీ, ప్లేట్‌లెట్ కౌంట్, బ్లడ్ గ్రూపు, హెచ్ఐవీ, హెచ్‌సీఎస్జీ, వీడీఆర్ఎల్, గల్ల పరీక్ష, ర్యాండం బ్లడ్ షుగర్, యూరియా క్రియాటిన్, మలేరియా, డెంగీ, వైడల్, ఎస్‌టీ, ఎస్ జీపీటీ, ఎఎల్పీ, లిపిడ్ ప్రొఫైల్, సోడియం, పొటాషియం, క్లోరైడ్ , యూరిన్ మైక్రోస్కోపిక్ వంటి 63 రకాల పరీక్షలు చేయనున్నారు.

గతం కన్నా నేడు ఎంతో నయం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందేవి కావు. చిన్న జ్వరం వచ్చినా పట్టణానికి వెళ్లాల్సిన వచ్చేది. దీంతో రోగులకు ఆర్థిక భారంతో పాటు వ్యయప్రయాసాలకు గురయ్యేవారు. ఇప్పుడా పరిస్థితికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెక్ పెట్టింది. గ్రామాలకే వెళ్లి మెరుగైన వైద్య అందించాలనే లక్ష్యంతో 104 వాహనం సైతం ఏర్పాటు చేసింది.

అత్యాధునిక వైద్య పరికరాలు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అత్యాధునిక వైద్య పరికరాలు వచ్చాయి. 63 రకాల పరీక్షలు నిర్వహించేందుకు నెల పాటు శిక్షణ ఇచ్చారు. పీహెచ్‌సీలో అన్ని రకాల టెస్టులు చేస్తున్నాను. ప్రైవేటు ల్యాబ్‌లో వేల రూపాయలు ఖర్చు అయ్యే పరీక్ష ఇక్కడ ఉచితంగా చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తు రోగులకు ప్రత్యక్షంగా సేవచేస్తున్నందుకు సంతోషంగా ఉంది.
– సురేష్, ల్యాబ్ టెక్నీషియన్, విజయపురం, పీహెచ్‌సీ.

రోగులకు ఎంతో సౌలభ్యం



నూతన పరికరాలు అందుబాటులోకి రావడంతో 63 రకాల వైద్య పరీక్షలు.. చేసేందుకు అవకాశం కలిగింది. ఇకపై వైద్య పరీక్షల కోసం పట్టణానికి వెళ్లాల్సిన అవసరం లేదు. రోగులకు వైద్య పరీక్షలు చేసి రోగ నిర్ధారణ అయిన తరువాత అవసరమైన వైద్యాన్ని ఇక్కడే అందిస్తున్నాం. గతంలో ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు లేక పోవడంతో రోగులు అవస్థలు పడేవాళ్లు.
– సోమశేఖర్, వైద్యాధికారి, విజయపురం

ఉపాధ్యాయుల బదిలీ దరఖాస్తుల పరిశీలన

నగరి : మండలంలోని 86 మంది ఉపాధ్యాయులు 2023 సాధారణ బదిలీలకూ దరఖాస్తు చేసుకున్నారు. వారి దరఖాస్తులను శుక్రవారం ఎంఈవో శ్రీదేవి పరిశీలించారు. దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సేవా పుస్తకంలో పరిశీలనచేసి వచ్చిన పాయింట్లు సరి పోల్చారు. ఇందు నిమిత్తమై ఒక టీమ్‌ను ఏర్పాటు చేశారు. పరిశీలనలో ప్రధానోపాధ్యాయులు కుప్పరాజు, ఉలగనాధం, తులసి, రాజ్ కుమార్, సంజీవి, సుబ్రమణ్యం, మహేష్, రమేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.


దరఖాస్తులు పరిశీలిస్తున్న ఎంఈఓ, టీం సభ్యులు

నందీశ్వరుడిపై శివపార్వతుల విహారం


విద్యుద్దీప కాంతులీనుతున్న సదాశివేశ్వరాలయం

పుత్తూరు రూరల్: శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శివపార్వతులు అధికార వాహనమైన నందీశ్వరుడిని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భిక్షాటన ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. రాత్రి 8 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టు పీతాంబరాలు, విశేష ఆభరణాలు, సుగంధ పరిమళ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి, నందీశ్వరుడిపై ఆశీనులను చేశారు. మహిళల కోలాట నృత్యాలు, మేళతాళాలు, వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు.


నందీశ్వరుడిపై విహరిస్తున్న శివపార్వతులు

ఇంటింటా కర్పూర హారతులు అందుకుంటూ శివపార్వతులు భక్తులను కటాక్షించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కె.రమేష్‌బాబు పర్యవేక్షించారు.

రోడ్ల నిర్మాణం వేగవంతం

చిత్తూరు అర్బన్: టిడ్కో గృహ సముదాయాల వద్ద రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని నగర కమిషనర్ అరుణ కాంట్రాక్టర్లను ఆదేశించారు. నగరపాలక పరిధిలో శుక్రవారం పూనేపల్లె వద్దనున్న టిడ్కో గృహ సముదాయాల వద్ద జరుగుతున్న పనులను కమిషనర్ పరిశీలించారు. రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులను తనిఖీ చేసి అధికారులతో మాట్లాడారు. ఈ కాలువల నిర్మాణం, పైపులైన్ల ఏర్పాటు, విద్యుదీకరణ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. భవనాల్లో పెండింగ్‌లో ఉన్న చిన్నపాటి సివిల్ పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. టిడ్కో గృహాల వద్ద జరుగుతున్న పనులను ప్రతి రెండు రోజులకోసారి తనిఖీ చేస్తామని, స్పష్టమైన పురోగతి కనిపించాలన్నారు. కార్యక్రమంలో టిడ్కో ఈఈ వెంకట ముని, సీఎంఎం గోపి, ధనుంజయ రెడ్డి, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

ఇసుక అక్రమ రవాణా కట్టడికి చర్యలు

పిచ్చాటూరు: మండలంలో ఇసుక అక్రమ రవాణా కట్టడికి అధికారులు ఉపక్రమించారు. శుక్రవారం అరుణానది పరీవాహక ప్రాంతాల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు పర్యటించారు. నది నుంచి ట్రాక్టర్ బయటకు వచ్చేందుకు వీలుకాకుండా రోడ్డు మార్గాన్ని జేసీబీతో ట్రెంచ్ కొట్టించారు. తహసీల్దారు మధుసూదన్‌రావు మాట్లాడుతూ, మండలంలో తాము గతంలో ఇసుక రవాణాకు ఇచ్చిన అనుమతులన్నీ రద్దు చేశామని, ఇక అక్రమంగా ఇసుక తరలిస్తే వాహనాలు సీజ్ చేయాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, పోలీసులు పాల్గొన్నారు.


పులికుండ్రం వద్ద అరుణానది మార్గంలో జేసీబీతో ట్రెంచ్ కొట్టిస్తున్న అధికారులు

బాల్య వివాహం నేరం

నింద్ర: బాల్య వివాహం చట్టరీత్యా నేరమని పిచ్చాటూరు సీడీపీఓ శోభారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని నింద్ర, మిట్టకండ్రిగ, కొప్పేడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో కిశోర బాలికలకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు వారికి వివాహం చేయరాదని 21 ఏళ్లు పూర్తయ్యాకే వివాహం చేయాలన్నారు. బాలికల ఆరోగ్యంపై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కిశోర బాలికలు ఎలాంటి ప్రలోభాలకు గురికారాదని హితోక్తులు పలికారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బేబి, మహిళా పోలీసులు ఉమామహేశ్వరి, కీర్తి ప్రియ, కార్యకర్తలు మైథిలి, రేణుక, సబినా, రత్నం, భార్గవి, కర్పగం, ద్రాక్షాయణి పాల్గొన్నారు.

జూన్ 2న వేదనారాయణుని కంచి గరుడ సేవ

పిచ్చాటూరు: జూన్ 2న నాగలాపురంలోని శ్రీ వేదనారాయణ స్వామి ఆలయంలో కంచి గరుడ సేవ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కంచిలో శ్రీ వరదరాజ స్వామి ఆలయంలో గరుడ సేవను పురస్కరించుకుని నాగలాపురంలో ఈ సేవ నిర్వహించడం ఆనవాయితీ. 2న ఉదయం 6.30 నుంచి 8.30 గంటల మధ్యలో సర్వాలంకార భూషితుడైన స్వామివారు గరుడ వాహనంపై అధిష్ఠించి, తిరువీధుల్లో విహరిస్తూ, భక్తులకు దర్శనమిస్తారని టీటీడీ అధికారులు తెలిపారు.

ఉయ్యాల సేవలో పద్మావతీ అమ్మవారు



నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం పద్మావతీ అమ్మవారు ఉయ్యాల సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను పూర్తి చేశారు. 7 గంటలకు వెంకన్నకు, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను నిర్వహించారు. సాయంత్రం నిత్య కైంకర్యాలను అందుకున్న అమ్మవారు తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి అంతర ప్రాకారంలో విహరించిన అనంతరం ఉయ్యాలసేవలో సేదదీరారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని మరువరాదు

రేణిగుంట: చిన్నతనం నుంచే తెలుగు భాష ఔన్నత్యాన్ని మరువరాదని బాలోత్సవ్ జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరం 24వ రోజు ఆయన పాల్గొని పిల్లలను ఆటపాటలతో అలరించారు. తెలుగుభాష మధురమైనదని, భాషలు ఎన్ని నేర్చుకున్నా మాతృ భాషను మరువరాదన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సృజనను పెంచే రీతిలో ఇలాంటి సమ్మర్ క్యాంపులను నిర్వహించడం హర్షదాయకమన్నారు. గ్రంథాలయాధికారిణి శ్రీముఖి, విద్యావికాస వేదిక కన్వీనర్ వెంకటరమణ పాల్గొన్నారు.

సంక్షేమ రథ సారథులకు పురస్కారాలు


పురస్కారాలందుకున్న వలంటీర్లతో కృపాలక్ష్మి, ప్రజాప్రతినిధులు

పాలసముద్రం : ప్రభుత్వం సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారని డిప్యూటీ సీఎం కుమార్తె కృపాలక్ష్మి, ఎంపీపీ శ్యామల, జెడ్పీటీసీ అన్బళగన్ తెలిపారు. బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో శుక్రవారం ఉత్తమ వలంటీర్లకు ఎంపీడీఓ శ్రీనివాసన్, తహసీల్దార్ బాబు సమక్షంలో సన్మానం చేశారు. దీనికి విచ్చేసిన వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు కృపాలక్ష్మి జ్యోతి వెలిగించి వలంటీర్లతో కలసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కృపాలక్ష్మి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా నవరత్న పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు ముఖ్యపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. స్వచ్ఛందంగా ప్రజాసేవలో అమూల్యమైన సేవలందిస్తున్న వలంటీర్లకు ప్రభుత్వం మూడు కేటగిరీల్లో ఎంపిక చేసి పురస్కారాలు అందిస్తోందని చెప్పారు.


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కృపాలక్ష్మి

అనంతరం సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలతో వలంటీర్లకు సత్కారం చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్ర కమిటీ చైర్మన్ ఎస్ శివప్రకాష్‌రాజు, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, గాలి మహేష్ బాబు, ఎంపీటీసీ గోవిందరాజు, వాసు రాజు, గోపి, ఈశ్వర్, అరుల్, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అప్పలాయగుంట బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

- టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం

వడమాలపేట : శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జేఈఓ వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి ఆయన బ్రహ్మోత్సవ ఏర్పాట్లను, పుష్కరిణిని పరిశీలించారు . అనంతరం అప్పలాయగుంట టీటీడీ కల్యాణ మండపంలో అధికారులతో ఆయన సమీక్షించారు. మే 31 నుంచి జూన్ 8వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు, పనులను రెండ్రోజుల్లో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ని ఆదేశించారు. రథం ఫిట్‌నెస్, తండ్ల పటుత్వాన్ని పరిశీలించాలని సూచించారు. శ్రీవారి సేవకులను అవసరమైనంత మందిని నియమించాలన్నారు. నాలుగుమాడ వీధుల్లో గోవింద నామాలు వినిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. గరుడ సేవ, రథోత్సవం రోజుల్లో భక్తులకు తాగునీరు, మజ్జిగ, ప్రసాదాలు పంపిణీ చేయాలన్నారు. విజిలెన్స్ అధికారులు స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుని పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు చలువ పందిళ్లను రేకులు లేకుండా ఏర్పాటు చేయాలన్నారు. భక్తులను దృష్టిలో ఉంచుకుని అదనపు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. గరుడ సేవ రోజున తీసుకోవాల్సిన చర్యలు, ఆలయంలో క్యూల ఏర్పాటు, విద్యుద్దీపాలు, పుష్పాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ఇత్యాది వాటిపై ఆయన చర్చించారు. డెప్యూటీ ఈఓలు గోవిందరాజన్, సుబ్రహ్మణ్యం, ఎస్ఈలు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, డిప్యూటీ సీఎఫ్ శ్రీనివాస్, ఈఈ మనోహర్, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ , విద్యుత్ విభాగం డీఈ చంద్ర శేఖర్, ఏఈఓ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీరబ్రహ్మం

చింతాకు కోస్తూ బావిలో పడి వివాహిత మృతి

- వైఎస్సార్ సీపీ నాయకుని ఇంట విషాదం
- పరామర్శించిన పలువురు నాయకులు

వడమాలపేట : కాలుజారి వ్యవసాయ బావిలో పడి వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలోని బాలినాయుడు కండ్రిగ పంచాయతీ తిప్పారెడ్డి కండ్రిగలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోపాల్‌రెడ్డి భార్య మౌనిక (28) గురువారం తమ వ్యవసాయ బావి వద్ద చింతాకు కోస్తుండగా కాలు జారడంతో అదుపు తప్పి వ్యవసాయ బావిలో పడిపోయింది. ఇది ఎవరూ గమనించలేదు. ఆమె ఇంటికి రాకపోవడంతో బావి వద్దకు వెళ్లి పరిశీలించేసరికి ఆమె బావిలో పడి మరణించినట్లు గ్రహించి దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతదేహాన్ని వెలికితీశారు. శుక్రవారం పుత్తూరులో పోస్టుమార్టం అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడు రాంప్రసాద్‌రెడ్డి మౌనిక మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గోపాల్‌రెడ్డిని పరామర్శించారు. మౌనిక ప్రమాదశాత్తు మరణించడం కలచివేస్తోందని, కుటుంబానికి పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లోకేష్‌రెడ్డి, కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, సచివాలయ కన్వీనర్ సురేష్‌రాజు, నాయకులు సోమశేఖర్‌రెడ్డి, మునిశేఖర్, పరంధామరెడ్డి, మురగారెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మౌనిక మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

గ్రంథాలయంలో వేసవి సందడి


ధ్యానం చేస్తున్న విద్యార్థులు

పుత్తూరు రూరల్: స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలువురు విద్యార్థులకు డ్రాయింగ్, మెడిటేషన్‌పై శిక్షణ ఇచ్చినట్లు లైబ్రేరియన్ మీనాకుమారి తెలిపారు. ప్రత్యేకంగా ఒక క్వాలిఫైడ్ టీచర్‌ను నియమించుకొని విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తమ పిల్లలను గ్రంథాలయానికి పంపి, వారి అభిరుచుల మేరకు ఉచిత శిక్షణ పొందవచ్చని చెప్పారు. కథలు చెప్పడం, పుస్తక పఠనం , డ్రాయింగ్, మెడిటేషన్, స్పోకెన్ ఇంగ్లిష్..మొదలైన వాటిపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 5 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన వచ్చునని చెప్పారు. కార్యక్రమంలో టీచర్ సుధ పాల్గొన్నారు.


డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు

గంగమ్మకు భక్తుల పొంగళ్లు


తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో భక్తుల కోలాహలం

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మకు శుక్రవారం భక్తులు పెద్ద ఎత్తున పొంగళ్లు పెట్టారు. అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి సర్వాంగ సుందరంగా కొలువుతీర్చారు. భక్తులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు వండి అమ్మవారి కొడిస్తంభం వద్ద నైవేద్యం సమర్పించి పిండి దీపారాధన చేశారు. కొందరు భక్తులు గంగబొట్లు పెట్టుకుని వేయికళ్ల దుత్తలు, వేపాకులు చేతపట్టి ఆలయ ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు.